సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 11 । జూలై । 2023



నగర జనాభా 23.31 లక్షలు

2023 నాటికి విశాఖ నగర జనాభా 23,31,000కు చేరే అవకాశం ఉందని జనాభా అధ్యయన కేంద్రం తెలిపింది. 8లో



తక్షణమే అర్జీల పరిష్కారం

జగనన్నకు చెబుదాంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. 8లో



13 మందికి స్కాలర్‌షిప్

పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న 13 మంది విద్యార్థినులు ప్రగతి స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. 8లో

న్యూస్‌రీల్

కృషి, పట్టుదల, ప్రణాళికతోనే లక్ష్య సాధన



వీసీ ఆచార్య వెంకటరావును సత్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ శ్రీసుధ

సబ్బవరం : మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక ప్రకారం కోర్సు పూర్తి చేసి మంచి ప్లేస్‌మెంట్లు పొందాలని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ పి.శ్రీసుధ సూచించారు. 2023 –24 విద్యా సంవత్సరానికి సంబంధించిన తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రతిష్టను ఇనుమడింపజేసేందుకు ప్రయత్నించాలని, అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గోవాలోని ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఆర్.వెంకటరావు మాట్లాడుతూ సమాజానికి మంచి న్యాయవాదులను అందించడమే జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల ఏర్పాటు ఉద్దేశమన్నారు. విద్యార్థులు నాని పాల్కీవాలాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థి జన్మనిచ్చిన తల్లి, చదువుకున్న విశ్వవిద్యాలయం, దేశాన్ని మర్చిపోకూడదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఇన్‌చార్జి డాక్టర్ నాయుడు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ దయానంద మూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సహకారంతోనే ఉత్తమ తీర్పులు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్



దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

విశాఖలీగల్: న్యాయవాదుల సహకారంతోనే న్యాయస్థానాలు ఉత్తమ తీర్పులను ఇవ్వగలవని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన విశాఖ న్యాయస్థానాలను, న్యాయవాదుల సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. న్యాయవాదులు సమాజహితాన్ని కాంక్షించి పనిచేయాలని సూచించారు. కక్షిదారులు సత్వర న్యాయం అందించడానికి న్యాయవాదుల సహకారం ఎంతో ముఖ్యమైందన్నారు. నిర్మాణం పూర్తి చేసుకుంటున్న న్యాయవాదులు సంఘం భవనం, కొత్త న్యాయస్థానాల సముదాయాన్ని వచ్చే నెలలో ప్రారంభించే అవకాశం ఉందన్నారు. మహిళా న్యాయవాదులు ప్రస్తుతం ఉంటున్న కార్యాలయాన్ని త్వరలోనే నూతన భవనంలోకి మార్చే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, జస్టిస్ దుర్గాప్రసాద్‌ను సన్మానించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షురాలు బి.లత, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

రెండో క్యాజువాలిటీ పనుల ప్రారంభం

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో రెండో క్యాజువాలిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నుంచి రూ.30 లక్షలను జిల్లా కలెక్టర్ మల్లికార్జున విడుదల చేశారు. దీంతో సోమవారం పనులను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రారంభించారు. ప్రస్తుతం 20 పడకలు ఉండగా, తాజాగా మరో 30 పడకలు నిర్మించనున్నారు.

80 ద్విచక్ర వాహనాల సీజ్

బీచ్‌రోడ్డు: రాత్రి సమయంలో అనవసరంగా రోడ్ల మీద తిరుగుతున్న ద్విచక్ర వాహనదారులపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు 80 వాహనాలను మూడో పట్టణ పోలీసులు సీజ్ చేశారు. సీఐ రామారావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఆకతాయిలకు చెందిన 80 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు.

సేఫ్టీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న సేఫ్టీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. ఇండస్ట్రియల్ సేఫ్టీ (ఏడాది వ్యవధి), ఫైర్ సేఫ్టీ (6 నెలలు), కెమికల్ సేఫ్టీ (3 నెలలు), ఆఫీస్ ఆటోమేషన్ సేఫ్టీ (3 నెలలు) కోర్సుల్లో చేరడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99123 40281, 93469 61049 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పెల్లుబికిన ఆగ్రహం



తాటిచెట్లపాలెం జంక్షన్‌లో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో వలంటీర్ల మానవహారం



నిరసన తెలుపుతున్న వలంటీర్లు

- పవన్ వ్యాఖ్యలపై వలంటీర్లు నిరసన
- మానహారాలు, దిష్టిబొమ్మలు దహనం
- బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక

సాక్షి, విశాఖపట్నం : ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా వ్యవహరిస్తూ.. ప్రతి సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటికే చేరుస్తూ.. ప్రజల హృదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు వలంటీర్లు. ప్రతి నెలా ఒకటో తేదీన కోడి కూయకముందే పింఛన్ డబ్బులు చేతికందిస్తూ.. అవ్వాతాతల మోముల్లో చిరునవ్వుగా మారిన వలంటీరు వ్యవస్థపై పవన్‌కల్యాణ్ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. వలంటీర్లు ఆడవాళ్ల అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నారంటూ దిగజారుడు ప్రసంగాలు చేశారు. ఆయన వ్యాఖ్యలపై ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. కరోనా సమయంలో తామెంతో సేవ చేశామనీ.. ఆ సమయంలో ప్రజల కోసం మీరేం చేశారంటూ పవన్‌ని వలంటీర్లు ప్రశ్నించారు. హ్యూమన్ ట్రాఫికింగ్‌లో వలంటీర్ల హస్తం ఉందని నిఘా సంస్థ చెప్పినట్లుగా మాట్లాడిన పవన్ కల్యాణ్‌కు దమ్ముంటే.. ఆ నిఘా సంస్థ డేటాకు సంబంధించి శ్వేతప్రతం విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. యావత్ దేశం ఇక్కడ వలంటీర్ వ్యవస్థని కొనియాడుతుంటే.. వలంటీర్లను కించపరిచే విధంగా పవన్ మాట్లాడటం మానుకోవాలనీ.. తక్షణమే తమకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలనీ.. లేదంటే భవిష్యత్తులో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. వలంటీర్లు చేసిన ఆందోళనలకు ప్రజల నుంచి కూడా మద్దతు లభించడం విశేషం.

విశాఖ జిల్లాలో...

- తాటిచెట్లపాలెం జంక్షన్‌లో జాతీయ రహదారిపై ఉత్తర నియోజకవర్గం పరిధిలోని వార్డు వలంటీర్లు మానవహారం నిర్వహించారు. పవన్ కల్యాణ్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు వలంటీర్ల ఆందోళనకు మద్దతు పలికారు.
- భీమిలి పరిధిలోని వలంటీర్లు నిరసన ర్యాలీ నిర్వహించి.. చినబజార్ జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. అనంతరం పవన్ దిష్టిబొమ్మని దహనం చేసి తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. పవన్‌పై కేసు నమోదు చేయాలంటూ భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పద్మనాభం జంక్షన్‌లో వలంటీర్లు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.
- ఇసుకతోట జంక్షన్‌లో జాతీయ రహదారిపై వలంటీర్లు ధర్నాకు దిగారు. పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ పవన్ చిత్రాన్ని చెప్పులతో కొట్టారు. వలంటీర్ల ఆందోళనలకు ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ విశాఖ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్లు మద్దతు పలుకుతూ వారితో పాటు నిరసన వ్యక్తం చేశారు.
- గోపాలపట్నం పరిధిలోని వలంటీర్లు పవన్ వ్యాఖ్యలపై మండిపడుతూ ఆందోళనకు దిగారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే భవిష్యత్తు అనేది లేకుండా పోతుందని హెచ్చరిస్తూ గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- గాజువాక మున్సిపల్ కార్యాలయం నుంచి పాతగాజువాక జంక్షన్ వరకూ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. పవన్ దిష్టిబొమ్మని దహనం చేశారు. బహిరంగ క్షమాపణలు చెప్పకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.
- పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని వలంటీర్లు పవన్ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. జంక్షన్‌లో పవన్‌కు వ్యతిరేకంగా పోస్టర్లు ప్రదర్శించారు. మహిళా వలంటీర్లు పవన్ ఫొటోని చెప్పులతో కొట్టి తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు.



ఇసుకతోట వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వలంటీర్లు



భీమిలి చిన్నబజార్ సెంటర్‌లో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు



పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వలంటీర్లు



గోపాలపట్నం సీఐ నరసింహారావుకు ఫిర్యాదు అందిస్తున్న వలంటీర్లు



పాతగాజువాకలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

రొయ్య కొనుగోలు రగడ కొలిక్కి..!

- మత్స్యకారులు, ఎగుమతిదార్ల మధ్య అవగాహన
- హార్బర్‌లో ఊపందుకున్న అమ్మకాలు



రొయ్యల రకం	ధర
పింక్/బ్రౌన్	రూ.380
టైగర్	రూ.1050
వైట్	రూ.420
ఫ్లవర్	రూ.520

సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో కొన్నాళ్లుగా కొనసాగుతున్న రొయ్యల కొనుగోళ్ల రగడ కొలిక్కి వచ్చింది. తాము వేటాడి తెచ్చిన రొయ్యలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని బోటు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తుండగా.. ఇతర దేశాలకు రొయ్యల ఎగుమతులు సన్నగిల్లడంతో ధరలు తగ్గాయని ఎగుమతిదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటు బోటు యజమానులు, అటు కొనుగోలుదార్ల మధ్య ప్రతిష్టంభన నెలకొంది. వేట నిషేధం తర్వాత చేపట్టిన చేపల వేటలో ఈసారి రొయ్యలు పెద్ద ఎత్తున లభ్యమవుతున్నాయి. రోజుకు సగటున ఐదారు టన్నుల రొయ్యలు హార్బర్‌కు వస్తున్నాయి. వీటిలో బ్రౌన్/పింక్, టైగర్, వైట్, ఫ్లవర్ రకాల్లో బ్రౌన్ రొయ్యలే 90 శాతం వరకు ఉంటున్నాయి. పశ్చిమ తీరం కంటే తూర్పు తీరంలోని బంగాళాఖాతంలోనే రొయ్యల లభ్యత అధికంగా ఉంటుంది. పైగా ఇక్కడ లభించే రొయ్యలకు డిమాండ్ బాగుంటుంది. ఈ నేపథ్యంలో కొనుగోలుదారులు విశాఖలో రొయ్యలను కొనుగోలు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ ఏడాది రొయ్యల లభ్యత బాగున్నా ఎగుమతులు ఆశాజనకంగా లేక కొనుగోళ్లతో పాటు వాటి ధరలూ తగ్గాయి. ఈ పరిస్థితుల్లో బోటు ఆపరేటర్లకు, ఎగుమతిదార్లు/కొనుగోలుదార్లకు మధ్య వివాదం తలెత్తింది. దీని ప్రభావం కొనుగోళ్లపై పడి స్తబ్దత నెలకొంది. దీనిపై రెండు రోజుల క్రితం బోటు ఆపరేటర్లు, ఎగుమతిదార్లతో మత్స్యశాఖ అధికారులు చర్చలు జరిపారు. తొలుత ఇరువర్గాల మధ్య చర్చలు ఫలప్రదం కాకపోయినా ఆ తర్వాత మత్స్యకార సంఘాల నేతలు, మత్స్యశాఖ అధికారుల కృషితో కొనుగోలుదార్లు దిగివచ్చారు. ప్రస్తుతం బ్రౌన్ రకం రొయ్యలు కిలో (60–80 కౌంట్) రూ.340–350కి కొనుగోలు చేస్తున్నారు. ఇకపై రూ.380కి కొనుగోలు చేయడానికి కొంతమంది ఎగుమతిదార్లు ముందుకొచ్చారు. అంతర్జాతీయ మార్కెట్లో కొనుగోళ్ల వేగం పుంజుకుంటే ఆ మేరకు ధర పెంచుతామని హామీ ఇచ్చారు. దీంతో హార్బర్‌లో కొనుగోళ్లు మళ్లీ ఊపందుకుంటున్నాయి.

కొనుగోలుదార్లు ముందుకొస్తున్నారు..

బోటు ఆపరేటర్లకు గిట్టుబాటయ్యే ధరలకు రొయ్యలు కొనుగోలు చేయాలని కొనుగోలుదార్లతో సంప్రదింపులు జరిపామని రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ 'సాక్షి'కి చెప్పారు. అందుకు వారు సమ్మతించడంతో బ్రౌన్ రకం కిలో రూ.380కి కొనుగోళ్లు మొదలు పెట్టారని, ఈ ధర స్థిరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్తగా ప్రాసెసింగ్ యూనిట్లను ఆహ్వానిస్తున్నామని, వారు కూడా కొనడానికి ముందుకొచ్చారని తెలిపారు. బ్రౌన్ రొయ్యల రేటు కిలో రూ.380కి కొనుగోలుకు ఎగుమతిదార్లు సమ్మతించడంతో కొనుగోళ్ల సమస్య కొలిక్కి వచ్చిందని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ 'సాక్షి'కి చెప్పారు.

ఏ ఒక్క ఓటు పోనివ్వం..

- ప్రతి ఓటును విభిన్న దశలో పరిశీలన చేస్తున్నాం
- 21 నుంచి ఎస్ఎస్ఆర్–2024 కార్యక్రమం
- నెల రోజుల పాటు ఇంటింట ఓటర్ల పరిశీలన
- రాజకీయ పార్టీలు బీఎల్ఏలను నియమిస్తే సమస్యలుండవ్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున



సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల్లో ఓటు హక్కు వజ్రాయుధంతో సమానం.. అందుకే ఏ ఒక్కరి ఓటు పోనివ్వకుండా పకడ్బందీగా ముసాయిదా రూపొందించేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున స్పష్టం చేశారు. ప్రతి ఓటును విభిన్న దశల్లో పరిశీలన చేస్తున్నామన్నారు. ఈ నెల 21 నుంచి ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఎస్ఆర్–2024) మొదలవుతోందనీ.. నెల రోజుల పాటు ఇంటింట ఓటర్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎవరు ఓటు లేదని అనిపించినా వెంటనే ఫిర్యాదు చేయవచ్చని స్పష్టం చేశారు. ఎస్ఎస్ఆర్–2024లో భాగంగా ముసాయిదా తయారీ కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి ఇంకా ఆయన ఏమి చెప్పారంటే...

అవగాహన కల్పిస్తున్నాం..

18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు తప్పకుండా ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ఫారం–6, 6బీ, గరుడ యాప్‌ల గురించి జిల్లాలోని పలు కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందికి కొత్త ఓటర్ల నమోదు కార్యాచరణపై ఇప్పటికే సమావేశాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించాం.

21 నుంచి ఇంటింట సర్వే

ఎస్ఎస్ఆర్–2024లో భాగంగా ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింట ఓటర్ల పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తాం. బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలిస్తారు. దీనికి సంబంధించి ఇటీవలే వర్క్‌షాప్ నిర్వహించి బీఎల్‌వోలకు అవగాహన కల్పించాం. ఆ ఇంట్లో ఓటర్లు ఉన్నారా లేదా..? 18 ఏళ్లు నిండినవారు నమోదు చేసుకున్నారా లేదా.. చేసుకోకపోతే వెంటనే నమోదు ప్రక్రియకు ఏర్పాట్లు చేయడం, ఇంటి నంబర్ ప్రకారం ఓటర్లు లేకపోతే.. వారి వివరాలు ఆరా తీసి.. ఓటు ఉంచాలా, తీసేయాలా, లేదా వేరే చోటుకు ట్రాన్స్‌ఫర్ చేయాలా అనే వివరాలు సేకరిస్తాం. ఓటర్ల చిరునామా, పేర్లు, ఫొటోలు, సరిచూసి, కచ్చితమైన నమోదు జరిగేలా చర్యలు తీసుకుంటాం. చిరునామా మారిన వారికి నోటీసులు జారీ చేసి ఆ నియోజకవర్గం నుంచి తొలగిస్తాం. అదేవిధంగా డెత్ ఓటర్లను కూడా తొలగించేస్తాం.

అక్టోబర్ 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్

నెల రోజుల పరిశీలన అనంతరం అక్టోబర్ 17న సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తాం. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకూ క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ చేపడతాం. ఇందుకోసం ప్రత్యేక క్యాంపులు కూడా ఏర్పాటు చేయనున్నాం. అక్టోబర్ 28, 29, నవంబర్ 18,19 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అభ్యంతరాలు తీసుకునే బాధ్యతని బీఎల్‌వోలకు అప్పగించాం. వాటి పర్యవేక్షణను ఈఆర్వోలు చేపడతారు. డిసెంబర్ 26 నాటికి వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లు పరిశీలించి పరిష్కరిస్తాం.

జనవరి 5న ఓటర్ల తుది జాబితా

ఇవన్నీ జరుగుతున్న సమయంలోనే రెండు ఆదివారాలు, రెండు శనివారాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తాం. 2024 జనవరి 1న ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ, తనిఖీ ప్రక్రియ జరుగుతుంది. అనంతరం జనవరి 5న తుది జాబితాని ప్రకటిస్తాం. ఈ జాబితా ప్రకారమే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంటుంది.

రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లాలో 1,945 మంది బీఎల్‌వోలు ఇంటింటి పరిశీలనకు వెళ్లే సమయానికి అన్ని రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్ల(బీఎల్ఏ)ని నియమించాలి. ఈ విషయం పలు మార్లు ఆయా పార్టీలకు చెప్పాం. కానీ.. వారి నుంచి స్పందన లేదు. బీఎల్‌వో, బీఎల్ఏలు కలిసి పరిశీలన జరిపితే ఎక్కడా తప్పులు దొర్లే ప్రసక్తే లేదు. అదేవిధంగా రాజకీయ పార్టీలు తప్పుడు ఫిర్యాదులు, ప్రకటనలు చేసి ఎన్నికల అధికారులు, సిబ్బంది సమయాన్ని వృథా చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం.

కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతం

మహారాణిపేట : కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీని సోమవారం వైద్యులు విజయ వంతంగా నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో కార్డియోథొరసిక్ విభాగాధిపతి (హెచ్‌వోడీ) డాక్టర్ కె.మణిత ఆధ్వర్యంలో వైద్యులు రెండున్నర గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. శ్రీకాకుళం జిల్లా వంగర గ్రామానికి చెందిన డి.ధనుంజయ అనే 18 ఏళ్ల యువకుడు గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. ఊపిరితీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఇతర ఆరోగ్య సమస్యలూ ఉన్నాయి. దీంతో కేజీహెచ్‌లో కార్డియాలజీ వైద్యులను సంప్రదించాడు. గుండెలో రంధ్రం ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. తక్షణం ఓపెన్‌హార్ట్ సర్జరీ చేయాలని భావించారు. ఆరోగ్యశ్రీలో రోగికి సర్జరీ సోమవారం విజయవంతంగా పూర్తి చేశారు. రోగి ఆరోగ్యంగా ఉన్నాడని, ఐసీయూకి తరలించామని కేజీహెచ్ కార్డియోథొరసిక్ విభాగాధిపతి డాక్టర్ కె.మణిత చెప్పారు. రోగి ధనుంజయను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పరామర్శించారు.



రోగిని పరామర్శిస్తున్న కేజీహెచ్ సూపరింటెంటెంట్ శివానంద్

అందుబాటులో టెంపరేచర్ కంట్రోల్ మెషీన్

ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీకి అవసరమైన పరికరం ఇటీవల మరమ్మతులకు గురైంది. దీంతో కొద్ది నెలలుగా గుండె శస్త్ర చికిత్సలు జరగడం లేదు. కలెక్టర్ మల్లికార్జున, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చొరవ తీసుకొని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆమె రూ.40 లక్షల విలువ చేసే టెంపరేచర్ కంట్రోల్ మెషిన్‌ను మంజూరు చేశారు. ఈ మిషన్‌ను ఆస్పత్రిలో అమర్చిన తరువాత తొలిసారిగా సోమవారం ధనుంజయకు ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహించారు.

నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ

దొండపర్తి: టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ సంస్థ ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల ఒక ప్రకటనలో తెలిపారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సులో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కోర్సు అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు జాబీ జంక్షన్ ప్రాంతంలో ఉన్న నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో గానీ, 9502874304, 9908104113 నెంబర్లకు ఈ నెల 15లోగా సంప్రదించాలని సూచించారు.

రైతులకు ఇచ్చిన లేఅవుట్లను 22ఏ నుంచి తొలగించాం

ముదపాక సమస్యకు ప్రత్యామ్నాయం చేపట్టాం : కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం : నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా చేపట్టిన భూ సమీకరణలో భూములిచ్చిన రైతులకు అందించిన లేఅవుట్లను 22ఏ జాబితా నుంచి తొలగించే ప్రక్రియ వేగవంతం చేశామని కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ 26 లే అవుట్స్ రైతుల కోసం ఎక్స్‌క్లూజివ్‌గా ఏర్పాటు చేశామని, ఇందులో 23 లేఅవుట్లను ఇప్పటికే నిషేధిత 22ఏ జాబితా నుంచి తొలగించామన్నారు. ఎల్‌పీసీలు కూడా జారీ చేశామని వివరించారు. త్వరలోనే రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన జీవో విడుదలవుతుందని తెలిపారు. ఈ లేఅవుట్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీఎంఆర్‌డీఏ రూ.220 కోట్లతో పనులు చేపట్టేందుకు సిద్ధమవుతోందని వెల్లడించారు. ముదపాక మినహా జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ వేగవంతంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. బలవంతంగా భూములు తీసుకునే ప్రసక్తే లేదని ముదపాకలో సమస్యాత్మక ప్రాంతాల్లో రైతులకు తెలియజేశామన్నారు. ఇప్పటివరకూ సమస్య లేకుండా జరిగిన ప్రాంతాల్లో లబ్ధిదారులకు స్థలాలు మంజూరు చేశామన్నారు. మిగిలిన లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో సర్దుబాట్లు చేస్తున్నామని వివరించారు. తంగుడుబిల్లి, గిడిజాల లే అవుట్స్‌లో ఇప్పటికే 2,500 వరకూ లబ్ధిదారులకు పట్టాలందించామని, మరో 500 మందికి ఇతర ప్రాంతాల్లో పట్టాలిచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు.

'స్థాయీ సంఘాన్ని' గెలిపించుకుందాం

డాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఉమ్మడి విశాఖ వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సూచనలతో స్టాండింగ్ కమిటీ ఎన్నికకు పది మంది కార్పొరేటర్లను ప్రతిపాదించామని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. వారిని గెలిపించాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లపై ఉందన్నారు. జీవీఎంసీ మేయర్ చాంబర్లో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ నెల 19న జరగనున్న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో ఉన్న కార్పొరేటర్లను ప్రతిపాదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ ఒక్క ఓటు కూడా వృథా కాకుండా నిబంధనల ప్రకారం వేయాలని సూచించారు. కార్పొరేటర్లందరితో ఓటు వేయించాల్సిన బాధ్యత సంబంధిత ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు తీసుకోవాలన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ ఈ నెల 19న జరగనున్న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పది మంది కార్పొరేటర్లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ప్రస్తుత స్టాండింగ్ కమిటీ సభ్యులు, పార్టీ ప్రతిపాదించిన 10 మంది కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ప్రతిపాదించిన పది మందితో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు తదితరులు

వైఎస్సార్ సీపీ ప్రతిపాదించిన స్టాండింగ్ కమిటీ సభ్యులు వీరే..

అక్కరమాని పద్మ (ఒకటో వార్డు, భీమిలి), గుడ్ల విజయసాయి (23వ వార్డు, విశాఖ తూర్పు), ఉరుకుటి నారాయణరావు (29వ వార్డు, విశాఖ దక్షిణ), కోడిగుడ్ల పూర్ణిమ (41వ వార్డు, విశాఖ దక్షిణ), కంటిపాము కామేశ్వరి (47వ వార్డు, విశాఖ ఉత్తర), చల్లా రజని (54వ వార్డు, విశాఖ ఉత్తర), బల్లా లక్ష్మణరావు (62వ వార్డు, విశాఖ పశ్చిమ), భూపతిరాజు సుజాత (73వ వార్డు, గాజువాక), బట్టు సూర్యకుమారి (77వ వార్డు, పెందుర్తి), పీలా లక్ష్మీ సౌజన్య (81వ వార్డు అనకాపల్లి).

స్టాండింగ్ కమిటీకి 19 నామినేషన్లు

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఈ నెల 19న జరగనున్నాయి. ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో అర్హులైన కార్పొరేటర్లు నామినేషన్లు వేసుకోవాలని సెక్రటరీ పి.నల్లనయ్య సూచించారు. వైఎస్సార్ సీపీ తరఫున అక్కరమాని పద్మ, గుడ్ల విజయసాయి, ఉరుకుటి నారాయణరావు, కోడిగుడ్ల పూర్ణిమ, కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, బల్లా లక్ష్మణరావు, భూపతిరాజు సుజాత, బట్టు సూర్యకుమారి, పీలా లక్ష్మీ సౌజన్య నామినేషన్లు వేయగా.. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నుంచి గోడి విజయలక్ష్మి, బొమ్మిడి రమణ, పిసిని వరహాలక్ష్మీ నరసింహం, శరగడం రాజశేఖర్, గంధం శ్రీనివాసరావు, నొల్లి నూకరత్న, పిల్లా మంగమ్మ, ముక్కా శ్రావణి నామినేషన్లు దాఖలు చేశారు.

ఉచిత శిక్షణకు ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో నిరుద్యోగ యువతకు భారత ప్రభుత్వరంగ సంస్థ సీఐపీఈటీ (విజయవాడ) ఉపాధి కల్పనతో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.శేఖర్ సోమవారం తెలిపారు. ఇప్పటికే 30 మంది విజయవాడలో శిక్షణ పొందుతున్నారని, మరో 30 మందికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల నివాసులైన నిరుద్యోగ యువతకు విజయవాడలో 6 నెలలపాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. అనంతరం సర్టిఫికెట్‌తోపాటు విశాఖ, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నైలో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయాలతోపాటు నెలకు రూ.3 వేలు స్టైఫండ్ అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు సీఐపీఈటీ ప్రతినిధి బెజవాడ శివకుమార్ 9849263296ను సంప్రదించాలని, దరఖాస్తులను ఈ నెల 15లోగా పంపించాలని సూచించారు.



తక్షణమే అర్జీల పరిష్కారం

మహారాణిపేట : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికా రులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిటిషనర్లకు సమాధానం ఇచ్చే ముందు ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి మళ్లీ తిరిగి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 289 విజ్ఞప్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాస మూర్తి, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూశాఖ 87, జీవీఎంసీకి 60, పోలీసుశాఖకు 26, వివిధ శాఖల నుంచి 116 వినతులు వచ్చాయి.

స్థలం కేటాయించండి

జిల్లాలో గొర్రె పిల్లల పెంపక కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల అభివృద్ధి ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ జి.ప్రకాష్ యాదవ్ కోరారు. సోమవారం కలెక్టర్ మల్లికార్జునను కలిసి వినతి పత్రం సమర్పించారు. స్థలం కేటాయిస్తే ఫెడరేషన్ ద్వారా మేలురకపు విత్తనాలు, పొట్టేలు అభివృద్ధి చేసి పెంపకందారులకు సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్, పశ్చిమ గోదావరి జిల్లా చైర్మన్ ఎ.వి.కృష్ణరావు, తూర్పు గోదావరి జిల్లా చైర్మన్ డి.వి.వి.సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

డయల్ యువర్ మేయర్‌కు 11 ఫిర్యాదులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ మేయర్‌కు 11 వినతులు, ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 116 ఫిర్యాదులు వచ్చాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తన చాంబర్లో నిర్వహించిన డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న వినతులు సకాలంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనరు డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, సీఎంఓహెచ్ డాక్టర్ నరేష్‌కుమార్, డీడీహెచ్ దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్..

నగర జనాభా 23.31 లక్షలు

ఏయూక్యాంపస్: 2011 జనాభా లెక్కల ఆధారంగా తీసుకొని అంచనా వేస్తే ఉమ్మడి విశాఖ జిల్లా జనాభా 2023 నాటికి 46,51,857కు చేరే అవకాశం ఉందని ఏయూలోని జనాభా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య బి.మునిస్వామి తెలిపారు. వీరిలో 23,19,006 మంది పురుషులు, 23,32,851 మంది స్త్రీలు ఉంటారని అంచనా వేశారు. అదే విధంగా విశాఖ నగరం జనాభా 2023 నాటికి 23,31,000కు చేరినట్లు పేర్కొన్నారు. గతేడాది విశాఖ నగర జనాభా 22,79,076గా నమోదైంది. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈ లెక్కలు వివరించారు.

జనాభా పరిశోధన కేంద్రం

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జనాభా పరిశోధన కేంద్రం 1977లో ప్రారంభమైంది. నాటి నుంచి నేటి వరకు ఈ కేంద్రం పూర్తిస్థాయిలో సేవలు అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఏర్పాటైన 18 జనాభా అధ్యయన కేంద్రాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఏర్పాటైన ఏకైక కేంద్రం ఇది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది నిర్వహిస్తున్నారు. కేంద్రం నుంచి జనాభా సంబంధిత, సామాజిక, ఆర్థిక సంబంధిత అంశాలపై పరిశోధనలు నిర్వహిస్తారు. కుటుంబ సంక్షేమ పథకాల అమలు, ఫలితాలు పరిశీలిస్తారు. తాజాగా ఏయూలో జనాభా పరిశోధన కేంద్రం ఎదురుగా డిజిటల్ జనాభా గడియాన్ని ఏర్పాటు చేశారు. దేశంలో, రాష్ట్రంలో జనాభా పెరుగుదలను ఈ డిజిటల్ క్లాక్ ప్రత్యక్షంగా చూపుతుంది.

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



జనాభా పెరుగుదలకు అనుగుణంగా మౌలిక వసతులు అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేయడానికి, అభివృద్ధి పను లు చేపట్టడానికి జనాభా గణాంకాలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయి. ప్రస్తుతం భౌగోళికంగా చిన్న జిల్లాగా ఉన్న విశాఖ.. జనాభా పరంగా పెద్ద జిల్లాగా భవిష్యత్తులో నిలవనుంది.

–ఆచార్య బి.మునిస్వామి, సంచాలకులు, జనాభా పరిశోధన కేంద్రం, ఏయూ

ప్రగతి స్కాలర్‌షిప్‌నకు 13 మంది ఎంపిక

సింహాచలం: ఢిల్లీలోని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అందించే ప్రగతి స్కాలర్‌షిప్ (2022–23)నకు పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో చదువుతున్న 13 మంది విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున స్కాలర్ షిప్ వస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థినులను కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు వీఆర్ఎస్ మూర్తి, కె.సత్తిబాబు, డాక్టర్ ఎం.నాగమణి, కేవీ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, బి.శేషసాయి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

నక్కపల్లి: ఆర్‌బీఐ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో గత నెల నిర్వహించిన క్విజ్ పోటీల్లో స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థులు గొర్ల నిత్య(10వ తరగతి), నాగస్వాతిలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో నరేష్ తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి ఆధ్వర్యంలో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ నెల 14న విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు పర్యవేక్షకులుగా నాగప్రవీణ్ వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

కొమ్మాది : భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఇద్దరు వ్యక్తులు ధ్వంసం చేశారు. జీవీఎంసీ 5వ వార్డులో ఈ సంఘటన చోటుచేసుకుంది. సాయిరాం కాలనీలో 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి కొందరు దుండగులు రాళ్లతో కొట్టి ధ్వంసం చేశారు. ఈ సంఘటనను దళిత సంఘాలు, రాజకీయ నాయకులు తీవ్రంగా ఖండించారు. దుండగులను కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు.

జై భీమ్ ప్రతినిధుల నిరసన : జై భీమ్ అసోసియేషన్ అధ్యక్షుడు సియాద్రి కనకరాజు, గౌరవాధ్యక్షుడు కుడుత రామారావు, గౌరవ సలహాదారుడు గాదె రోశిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహం

మద్యం మత్తులో... : ఇక్కడ సాయిరాం కాలనీ ఫేజ్–2లో నివాసం ఉంటున్న ఆంబోతు జగన్, రమణలు మద్యం మత్తులో విగ్రహాన్ని ధ్వంసం చేసినట్టు అంగీకరించారు. పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న ఏసీపీ శివరామరెడ్డి, లా అండ్ ఆర్డర్ ఎస్సై సునీత సంఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ముత్తంశెట్టి

కొమ్మాది: అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. సంఘటన చోటు చేసుకున్న కొన్ని గంటలకే తన సొంత నిధులతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. దీనిపై జై భీమ్ అసోసియేషన్ అధ్యక్షులు సియాద్రి కనకరాజు, దళిత సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.



ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం

అపోలోలో అరుదైన శస్త్ర చికిత్స

ఆరిలోవ : అపోలోలో ఓ వృద్ధుడికి అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. చికిత్స ద్వారా రోగితో కలిసి అపోలో వైద్యులు హెల్త్ సిటీ అపోలో ఆస్పత్రిలో సోమవారం విలేకరుతో మాట్లాడారు. కార్డియాలజీ బృందం డాక్టర్ డి.కె బారువా, డాక్టర్ ప్రాణిగ్రహి, డాక్టర్ త్రివేది తదితరులు మాట్లాడుతూ విశాఖలో వేపగుంటకు చెందిన 75 ఏళ్ల వృద్ధుడు మధుమేహం, హైపర్ టెన్షన్, సీఏడీ, పోస్ట్ యాంజియోప్లాస్టీతో కొన్నాళ్లుగా బాధపడ్డారు. అతని బంధువులు ఇటీవల రామ్‌నగర్ అపోలో ఆస్పత్రిలో వైద్యం కోసం చేర్పించారు. అక్కడ వైద్యులు పరీక్షలు జరిపి తీవ్రమైన శ్వాసకోశ లోపం, అయోర్టిక్ వాల్వ్‌స్టెనోసిస్, పల్మనరీ ఎడెమాతో బాధనడుతున్నట్లు గుర్తించామన్నారు. దానికి సంబంధించిన శస్త్ర చికిత్సను టీఏవీఆర్ ప్రక్రియ ద్వారా ఆధునిక వైద్యం చేసినట్లు తెలిపారు. అపోలో వైద్యులు తనకు పునర్జన్మ ప్రసాదించారని రోగి ఆనందం వ్యక్తం చేశాడు. సమావేశంలో వైదులు డాక్టర్ రవికాంత్, డాక్టర్ జైదీప్ పాల్గొన్నారు.



అపోలో వైద్యులతో కలిసి మాట్లాడుతున్న చికిత్స పొందిన వృద్ధుడు

నేడు విశాఖపట్నం-కొరాపుట్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: కె.కె.లైన్‌లో బొర్రా, కరకవలస మధ్యలో కొండచరియలు విరిగిపడిన కారణంగా విశాఖపట్నం-కొరాపుట్-విశాఖపట్నం,(08546/08545) పాసింజర్ స్పెషల్స్ మంగళవారం ఇరువైపులా రద్దు చేసినట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ఆటో దినోత్సవం

దొండపర్తి: వరుణ్ మోటార్స్(బజాజ్ ఆటో) ఆధ్వర్యంలో ఆటో దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆటోస్టాండ్ ల్లో కేక్ కటింగ్‌లు చేసి, ఆటో కార్మికులకు వాహనా న్ని నడిపే సమయంలో ధరించే దుస్తులను పంపిణీ చేశారు. ఈ ఆటో డే ఉత్సవాలను ఉత్తరాంధ్రలో అన్ని ప్రాంతాల్లోను ఆటో సోదరులు ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారని వరుణ్ బజాజ్ జనరల్ మేనేజర్ వంశీ తెలిపారు. లక్షల మంది ప్రయాణికులను రాత్రీ పగలు అనే తేడా లేకుండా తమ గమ్యస్థానాలకు చేరుస్తూ గొప్ప సర్వీసు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆటో డే సందర్భంగా వరుణ్ బజాజ్(ఆటో డివిజన్)లో ఆటో కొనుగోలుదారుల కు విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అన్ని షో రూంలలో వివిధ ఆఫర్లు ప్రకటించినట్లు చెప్పా రు. ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు ఆటో డే సందర్భంగా ప్రత్యేక వారంగా ప్రకటించి ఆటో కొనుగోలు చేసే వారికి దుస్తులు ఉచితంగా ఇవ్వడంతో పాటు ప్రత్యేక డిస్కౌంట్, ఇతర ఆఫర్లు ఇచ్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల్లోని సీనియర్ ఉద్యోగులు పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న వరుణ్ బజాజ్ జీఎం వంశీ

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): వేతనాలతోపాటు గ్రాట్యుటీ ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఏపీ కమిటీ పిలుపుమేరకు జీవీఎంసీ గాంధీబొమ్మ వద్ద 36 గంటల దీక్షకు సోమవారం శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలంతా నల్లచీరలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లను, హెల్పర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు కె.బృంద, పి.మణి, వై.తులసి, ఎల్.దేవి, ఆర్.శోభరాణి, కె.పద్మావతి, ఆర్.నాగేశ్వరి, ఎం.వెంకటలక్ష్మి, బి.భవాని, వై.శ్రీదేవి, నూకరత్నం, బి.ఈశ్వరమ్మ, పాపవేణి, ఎ.సత్య, ఎల్.ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి డీఎడ్ సప్లిమెంటరీ పరీక్షలు

భీమునిపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జిల్లా విద్య శిక్షణ సంస్థ(డైట్)ల్లో 2015–17 నుంచి 2018–20 వరకు డీఎడ్ కోర్సులు చదివి ఫెయిలైన అభ్యర్థులకు ఈనెల 12 నుంచి 15 వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ తెలిపారు. మొదటి సంవత్సరం ఫైన్ లెసన్ టీచింగ్ ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరు కానివారు, ఫెయిలైన విద్యార్థులకు ఈ పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు.